# బ్రతుకు భయం

జె. రామచంద్రమూర్తి

చాలాకాలంనుండీ వ్రాయాలనుకుంటున్నాను . కానీ భయం. మీరు చదువుతారని నాకు భయంలేదు అసలు చదవాలనే వ్రాయటం! కానీ భయం . . నా భయాన్ని చూసి మీరు నిద్రాహారాలు మానేసి నవ్వుతారేమోనని నాకు ఏమాత్రము భయంలేదు కానీ నేను భయపడుతున్నట్లుగానే—ఇంకా—ఎందరో—భయపడుతున్నారనే నా భయం ! ....

*   *   *

నేను గుమాస్తాని! .... బ్రతకాలనే మంచి ఉద్దేశ్యంతో నా చదువుసంధ్యలనూ—తెలివితేటలనూ—ఒక సంస్థకు కౌలుకిచ్చి—అడుగడుక్కూ భయపడుతూ బ్రతుకుతూన్న మామూలు గుమాస్తాని! . . గుమాస్తానని నాకు భయంలేదు. . అలా అని చెప్పుకోవటం నాకు గర్వం ! .... "చేస్తే 'ప్యూన్' గా నైనా చేయాలి—లేకపోతే 'గెజెటెడ్ ఆఫీసరయి' నా కావాలి" అని అంటూంటాడు మా మిత్రు డొకడు నిజమే ! . 'గుమాస్తా' అంటే అందరూ ఎందుకో చిన్నచూపు చూస్తారు . ఒక్క మా మావగారు తప్ప!.... ఎందుకంటే—నేను ఒక 'సాదా గుమాస్తా'ని అని తెలిసుండి కూడా ఆయన పిల్లనిచ్చాడు నాకు ఆరోజున—ఆయనకు గుమాస్తాలందరి తరపున కృతజ్ఞతలు చెప్పుకున్నాను.

*   *   *

మా ఆఫీసులో పనిచేస్తున్న అవధానికి పెళ్లి అయిన కొత్తలో—అంటే అయిదు సంవత్సరాల క్రితం—కొని ఇస్తానన్న రేడియో కనీసం వచ్చే సంకురాత్రికైనా వాళ్ల మావగారు కొంటారో లేదో నని భయం!

మాఆఫీసరుగార్కి తనపై ఎవరో పిటీషన్ పెట్టినందువల్ల రాబోయే ప్రమోషన్ ఆగిపోతుందేమోనని భయం.

ఇరవై అయిదో తారీఖున—జేబులో మిగిలిన అరవై ఆరు నయాపైసలతోనూ—తక్కిన ఆరు రోజులూ గడుస్తాయో లేదోనని—నా భయం !!!

*   *   *

మా ఆఫీసరు 'క్యాంపు' కు వెళ్లాడు ఎప్పుడూ తరగని పనిని ఆనాటికి కట్టేసి—సరీగా అయిదయ్యేసరికి ఆఫీసులో నుండి బయటపడ్డాను నీరెండ చాలా బాగుంది ఆడుకున్న బడిపిల్లలు హుషారుగా కేకలు వేసుకుంటూ గృహోన్ముఖులవుతున్నారు. అలసిపోయినవారి చిన్నారి ముఖాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. బస్‌స్టాప్ దగ్గర నిలబడిన నాకు—నా చుట్టూ ప్రపంచం ఎంతో వింతగా, సర్వాంగసుందరంగా కనిపించింది ఆరోజు బస్ వచ్చింది. నాకు ఎందుకో ఎక్కాలనిపించలేదు నాకోసం బస్ ఆగలేదు .. నేను బయల్దేరాను. కాసేపు 'టాంక్‌బండ్' మీద కూర్చున్నాను. ఆ తరువాత అక్కడకు కొంచెం దూరంలో ఉన్న 'టీ స్టాల్'కు వెళ్లి టీ త్రాగాను మనస్సెంతో తేలికయింది. ఆలోచిస్తూనే నడుస్తున్నాను. ఏదో మత్తెక్కించే మధురమైన సువాసనతో వాస్తవానికి వచ్చి చూశాను. ఎవరో రిక్షాలో వెడుతున్నారు. అతను ఆమెతో నవ్వుతూ ఏదో చెబుతున్నాడు ఆమె ఎందుకో చాలా సిగ్గుపడి పోయినట్లు కనిపించింది. వాళ్లకు ఏవీ భయాలు లేవు కాబోలు—ప్రపంచాన్ని జయించినట్లు ధైర్యంగా కనిపించారు. ఆమె తలలో మల్లెలు—వాటి పరిమళమే కాబోలు నన్ను మత్తెక్కించింది.

ప్రపంచంలో ఎన్నో రకాల పువ్వులుంటాయి. అందులో కొన్నింటికే అంతటి సువాసన ఎందుకో ? .మానవుల మాదిరిగానే పువ్వులు కూడా తమ తమ పూర్వజన్మ సుకృతాల ననుసరించి కర్మ ననుభవిస్తాయేమో అనిపిస్తుంది. కొన్ని పుష్పాలు మాలలై, భగవానుని హృదయంపై , తల దాచుకుని తరిస్తాయి మరికొన్ని మరణించిన మానవులతో కలసి స్మశానంలో బూడిద అయిపోతాయి.

ఆలోచిస్తున్న మనసును లక్ష్య పెట్టకుండా— అలవాటుపడ్డ కాళ్లు —నన్ను గమ్యానికి లాక్కుపోతున్నాయి. దారిలో అయిదు పైసలు పెట్టి పొతిక మల్లెపూలు కొన్నాను కొన్న తరువాత అనుకున్నాను 'చాలా తెలివితక్కువపని చేశానని !'....నిజమే—ఒకటో తారీఖు ఇంకా ఆర్రోజు లుందనగా—ప్రతి పైసని— ఒక రూపాయిగా చూడవలసిన నేను వాడిపోయి రాలిపోయే వాటికోసం అయిదుపైసలు అనవసరంగా వినియోగించటం తెలివితక్కువ కాదని ఏ గుమాస్తా మాత్రం అనగలడు ? జేబులో చేయిపెట్టి చిల్లరను బయటికి లాగాను ఇంకా అర్ధరూపాయి మిగిలిఉంది.

ఇంటికి చేరుకునేసరికి ఏడు గంటలు కావచ్చింది . అంటే రోజూకన్న దాదాపు రెండు గంటలు ముందుగానే ఇంటికి వచ్చానన్నమాట ! . ముందుగా వచ్చినందుకూ, మల్లెపూలు తెచ్చినందుకూ శాంత ఎంతో మురిసిపోతుం దనుకున్నాను కానీ అలాగేం జరగలేదు !! శేఖరానికి 'డింగీ' జ్వరమట! వళ్లు సలసలా కాగిపోతోంది . ఉదయము స్కూలునుండి రాగానే తలనొప్పి అని పడుకున్నాడట నాలుగయ్యేసరికి జ్వరం తగిలి చీకటిపడే వేళకు ఎక్కువయిందట. వళ్లు తెలియకుండా పడుకొని ఉన్నాడు

"డాక్టర్ని పిలిస్తే బాగుంటుంది" అని శాంత సలహా యిచ్చింది.

"నిజమే ! డాక్టర్ని తీసుకరావాలి! శేఖరానికి జ్వరం వెంటనే తగ్గిపోవాలి మా పెళ్లి అయిన మొదటి రెండు సంవత్స

# బ్రతుకు భయం

ఆలా మేం అనుభవించిన ఆనందానికి చిహ్నం శేఖరం ! అందుకే వాడంటే ఎంతో గారాం ! 'రాజశేఖరం' అని పెద్దవాళ్ల పేరు పెట్టుకున్నాం..... కనీసం శేఖరమయినా ఒక గెజెటెడ్ ఆఫీసరయితే చూడాలని మా ఆశ! ఏమైనా శేఖరానికి జ్వరం వెంటనే తగ్గిపోవాలి.!.... గబగబా డాక్టరుగారింటికి వెళ్లాను. లేరని తెలుసుకొని తిరుగుముఖం పట్టిన నాకు—దారిలో ఆయన ఎదురయ్యారు. సంగతి చెప్పి వెంటనే రమ్మన్నాను. ఆయన ముఖం ఇబ్బందిగా పెట్టాడు.

"సారీ బ్రదర్ ! ఇప్పుడే చాలా దూరం నుండి వస్తున్నాను. అయినా ఆజ్వరానికి



మరేం భయపడక్కరలేదు ఈ 'మాత్ర' కొని వేస్తే అదే తగ్గిపోతుంది"—అంటూ కాగితంమీద 'ప్రిస్క్రిప్షన్' ఇచ్చాడు... మంచి మనిషి గనుక ఆమాత్రమయినా చేశాడు. మరొకడయితే మనలో అసలు మాట్లాడేవాడా ? శాంత నీరసంగా ఉంటోందంటే 'కాల్షియం ఇంజక్షన్లు' ఇచ్చాడు క్రిందటి నెలలో! అదే నెలలో పాపకు కుక్క కరిస్తే పొట్టమీద పన్నెండో, పదమూడో ఇంజక్షన్లు ఇచ్చాడు. కానీ నే నింతవరకూ ఆయనకు ఫీజేమీ ఇవ్వలేకపోయాను. నేను గుమాస్తానని ఆయనకు తెలుసు!...

దారిలో ఉన్న మందులషాపుకు వెళ్లి చీటీ చూపించాను. మాత్రను పొట్లం కట్టి యిచ్చి—బిల్లు వ్రాసి యిచ్చాడు. రూపాయి ముప్ఫయి పైసలు ఏం చేయను? నేను తరచుగా ఆ షాపులోనే మందులు కొంటూంటాను. గౌరవంగా బ్రతికే 'గుమాస్తానని' వాళ్లకి తెలుసు. అందుకే నా దగ్గర డబ్బు లేదని చెప్పలేకపోయాను.... "పోనీ తరువాత యిస్తానంటే?" ఎదురుగుండా 'అరువు రేపు' అనే బోర్డు—నాకోసమే కట్టినట్లుగా వ్రేలాడుతోంది. నాలోని అభిమానం—నే నున్నానంటూ గుర్తుచేసింది

జేబులో చెయ్యి పెట్టి "సారీ ! డబ్బు తీసుకరావటం మరచిపోయాను. ఉంచండి! మళ్లీ వస్తాను!" అంటూ బిల్లూ, మందు పొట్లాం అక్కడే ఉంచి వెనక్కు తిరగబోయాను.

"ఫరవాలేదండి ! రేపివ్వండి డబ్బు !" అంటూ వాటిని నా ముందుకు త్రోశాడు షాపు యజమాని. అతని చిరునవ్వూ—సహృదయతను సూచించే కళ్లూ—నాకు యిప్పటికీ బాగా జ్ఞాపకం !.... "మనుష్యుల్లో మంచివాళ్లు లేకపోలేదు"—అనుకున్నాను.

గబగబా వెళ్లి శేఖరంచేత మాత్ర మింగించాను. రాత్రి రెండు గంటలకు కాబోలు జ్వరం కొంచెం దిగజారింది.

మరునాడుదయం నా జేబులోనే నలిగి వాడిపోయిన మల్లెపూలు చూసి చాలా బాధపడింది శాంత.

"ఎప్పుడూ బుద్ధిపుట్టి తీసుకువేరారు ! తెచ్చినా వాటిని పెట్టుకునే యోగం నా కుండద్దూ? క్రితం నెలలో కాబోలు జానకమ్మగారు ఇస్తే పెట్టుకున్నాను." అంటూ నాకు వినిపించే విధంగానే తన బాధను వ్యక్తంచేసింది శాంత! నాకు కోపం రాలేదు. ఎందుకో నాకు జీవితమంటే మొదటిసారిగా విరక్తి పుట్టింది.

మా పెళ్లయి పదేళ్లయింది. కనీసం ఏ నాలుగయిదు సార్లో తనకు నచ్చిన చీరలు కొని యిచ్చానేమో ? ఎప్పుడూ యంత్రంలా పనిచేస్తూ—ఉన్నా లేకపోయినా అల్లరి పెట్టకుండా సంసారాన్ని నెట్టుకొని వస్తోంది శాంత!.... ఏ ఆస్తిపరుణ్ణో పెళ్లి చేసుకుని ఉంటే ఎంత సుఖపడేది ?..... అసలు "గుమాస్తాలు పెళ్లి చేసుకోకూడదు"—అని ప్రభుత్వం శాసిస్తే ఎంత బాగుణ్ను?!!

* * *

ఆ మర్నాడు మరచిపోకుండా ఇంటికి వచ్చేటప్పుడు మళ్లీ మల్లెపువ్వులు కొని తీసుక వచ్చాను. పువ్వులు పెట్టుకుంటే శాంత చాలా అందంగా కనబడింది ఆ రాత్రి, శాంత చెప్పింది—నేను మరో పాపకు తండ్రి కాబోతున్నట్లు !! నెత్తిమీద ఎవరో సుత్తి పెట్టి కొట్టిన ట్లనిపించింది నాకు. నా పరిస్థితి నాకే భయం కలిగించింది.... ఉన్న ముగ్గురు పిల్లలకూ—ఏ ఒక్క పండుగకూ ఒక్కసారిగా బట్టలు కొనలేకపోయాను. ఆ ముగ్గురికీ లభిస్తున్న సౌకర్యాలను పంచుకునేందుకు మరొకరు పుట్టబోతున్నారన్నమాట!....నిజంగా నాకది ఒక భయంకరమైన సమస్యే మరి!.

ఎన్నో సమస్యలు అడుగడుక్కూ ఎదురవుతూ—బ్రతుకంటేనే భయమనిపిస్తున్నాయి. ..నా చిన్నతనంలో చదువుకునేటప్పుడు 'సోషల్ స్టడీస్' మాస్టారు' చెప్పే

వారు—'ఒక మనిషి బ్రతకటానికి ముఖ్యముగా కావలసినవి మూడు—తిండీ, గుడ్డా, వసతి అని!.... వర్త్రి.... ఆ మూడూ కాదు .... ఏదో పుస్తకంలో ఎవరో వ్రాశారని—చెప్పిన మాటలవి. అది చెప్పటానికి ఆయన 'జీతం' తీసుకుంటున్నాడు కనుక విజ్ఞాన్ని మభ్యపరచి—జీవితమంటే ఏమిటో తెలియని పసివాళ్ల హృదయాలను ప్రక్కదారికి మళ్లించాడు! బ్రతకాలంటే ముఖ్యంగా కావలసింది డబ్బు! డబ్బుతో ఆ మూడే కాదు—మరో ముప్పైమూడు కూడా పొందవచ్చు. డబ్బుంటే భార్య అవసరం ఉండదు. అప్పుడు సంతానానికి అవకాశమే ఉండదు. ఆ రెండూ లేనప్పుడు సమస్యల ప్రసక్తే ఉండదు. ఎన్నైనా తప్పుడు పనులు చేసి, డబ్బుతో వాటిని కప్పిపుచ్చుకోవచ్చు! ఎవరో అన్నట్లు—భగవంతుడు సృష్టించిన మనిషికన్న ఆ మనిషి సృష్టించిన డబ్బునే మిన్నగా గుర్తిస్తుందీ లోకం! చదువు లేకపోయినా ఫరవాలేదుట. 'డబ్బు లేనివాడు మాత్రం వింతపశువు !''—నేను కూడా డబ్బు సంపాదిస్తే ఎంత బాగుణ్ణు ? నా ఉద్దేశ్యంలో 'జీతం' వేరు ! డబ్బు వేరు !.... సమస్యల్ని సృష్టించేది 'జీతం!' వాటిని దూరం చేసేది డబ్బు!—అందుకే 'జీతం' వేరూ—'డబ్బు' వేరూ అన్నాను!'' ఆ డబ్బే ఉన్నవాడు నలుగురు కాదుకదా—మరో నలుగురు పుట్టినా నాకు భయమనిపించదు. అందరకూ పెద్ద చదువులు చెప్పించవచ్చు. ఆస్థిపరుల్ని చూసి అమ్మాయిలకు పెళ్లిళ్లు చేయవచ్చు.

* * *

''మీరీ సహాయం చేస్తే నాకీ ఏటికి తడుముకో నక్కరలేదు! నా క్రొచ్చేదాంట్లో నాలుగో వంతు—మీకు ముందుగా కావాలన్నా ఇవ్వటానికి నాకు అభ్యంతరంలేదు... ఆరోజు ఆఫీసునుండి ఇంటికి తిరిగి వస్తుంటే దారిలో తగిలిన—ఆ పెద్దమనిషి మాటలవి! నేను మవునంగానే వడుస్తున్నాను. నేను అతనికి ఆ సహాయం చేస్తే తనకు వచ్చే రెండువేల రూపాయల లాభంలోనూ నాకు నాలుగోవంతు అంటే అయిదు వందలు బహుమతీ యిస్తానన్నాడు. ఏమీ శ్రమపడకుండా అయిదు వందలు సంపాదించవచ్చు! అంటే దాదాపు మూడు నెలలకు సరిపడ్డ జీతం.... శాంతకు మంచివి నాలుగు చీరలు కొనవచ్చు. డాక్టరుగారికి పాత ఫీజంతా ఇచ్చేయవచ్చు!.... కానీ ముందున్నది జీవితం! నా భావి జీవితానికి మచ్చ పడకూడదు!.... అది నేను ఏనాడో చేసుకున్న నిర్ణయం !.... అందుకే బాగా ఆయనకు జవాబు చెప్పాను. 'అంతటి పరువన నేను చేయలేను. మీరు వెళ్ల వచ్చు!' అని! ఆ పెద్దమనిషి తోక ముడిచాడు. కానీ మర్నాడు అతను మళ్లీ ఆఫీసుకు వచ్చాడు. తిన్నగా ఆఫీసరు గదిలోకి వెళ్లాడు. చాలాసేపు ఇద్దరూ మాట్లాడుకున్నారు. నవ్వుకున్నారు. కాఫీలు త్రాగారు. ఆ తరువాత రెండు గంటలకు ఆఫీసరు నన్ను పిలిచాడు. ఆ కాగితాల గురించి అడిగాడు. అది 'రికమెండ్' చేయటానికి వీలుపడదని చెప్పాను. నిబంధనలకు



వ్యతిరేకమని కూడా చెప్పాను. "అవినీతి ననుసరించి నిబంధనలను 'హోవర్ లుక్' చేయ్యి"అన్నాడు. నేను గుమాస్తానని! అందుకే తల ఒంచుకున్నాను. "నీకు చేతులు రాక పోతే ఆ 'పేపర్స్' ఇటు పడేయ్!" ఆదేశం చాడు ఆఫీసరు. వెంటనే వాటిని ఆయ నకు ఇచ్చేశాను. పని జరిగిపోయింది. పెద్దమనిషి నాకేసి వెటకారంగా చూసి నవ్వుతూ నిష్క్రమించాడు. ఆ సాయంత్రం నన్ను ఆఫీసరు పిలిచాడు.... వెళ్లాను.

"చూడు మోహన్! నీకు ముగ్గురు పిల్ల లున్నారు! నువ్ మామూలు గుమాస్తావి. ఆస్తిపాస్తులు లేనివాడివి. ఈ రోజు లెటు పోటివో నీకు తెలియనిది కాదు. నీతిగా మడి కట్టుక కూర్చుంటే పిల్లల భవి ష్యత్తు ఏమవుతుందో ఆలోచించావా? మనం ఒకడికి ఉపకారం చేయటం, వాని వల్ల మనం ప్రత్యుపకారం పొందటం తప్పు కాదు" అంటూ ఆఫీసరు తన కోటుజేబు లోంచి రెండు వంద రూపాయల కాగితాలు బయటకుతీసి నాకు ఇవ్వబోయాడు!

"క్షమించండి సార్! ఇంకా నాకు అటు వంటి జీవితం అలవాటు కాలేదు"—అంటూ బయటకు వచ్చేశాను.

"మనం ఒకడికి ఉపకారంచేసి వాడివల్ల ప్రత్యుపకారం పొందటం తప్పుకాదు"— ఆఫీసరు మాటలు అడుగడుక్కీ నా చెవిలో మారు మోగుతున్నాయి. కానీ ఇక్కడ ఉపకా

# బ్రతుకు భయం

రానికీ ప్రత్యుపకారానికీ అవకాశంలేదు. నీతిగా, నిజాయితీగా మన ధర్మాన్ని నిర్వ ర్తించమని ప్రభుత్వం మనల్ని నియ మించి అందుకు మనకు 'జీతం' ఇస్తోంది. కానీ, ఆ ధర్మాన్ని విస్మరించి అర్హత గల వానిని అడుక్కి త్రొక్కి అనర్హుడికి అన్యా యంగా ఉపకారం చేయటం 'మోసం' అవు తుంది. వానివల్ల పొందే ప్రత్యుపకారం 'లంచం' అనిపించుకుంటుంది. ఆఫీసరు మాటల్లోని అంతరార్థం ఏమిటి? అత నికి పిల్లలు లేరు. భార్యవల్ల తరగని ఆస్తి లభించింది. మరి ఇంకా ఎందుకీ నీతిలేని పనులు?

ఆలోచిస్తూనే ఇంటికి వచ్చేశాను. ఆరాత్రి కాంత అంది—"సుభద్ర పండక్కి నెక్లెస్ చేయించుకుంటోంది"—అని. సుభద్ర ఏం చేసినా కాంత దృష్టిలోకి మరు క్షణ ములో వచ్చేస్తుంది. వాళ్లు మా పక్క వాటాలోనే ఉంటున్నారు. సుభద్ర భర్త కూడా నాలాగే మామూలు గుమాస్తా. కానీ అతనికి 'రాబడి' ఎక్కువ! ఏడాదికి ఒకసారి 'దేవుని పేర వ్రతం' చేస్తుంటాడు. వచ్చే 'చదివింపుల' తో భార్యకు నగలు చేయి స్తుంటాడు.

"మీరు కూడా 'వ్రతం'చేయకూడదూ" అంది ఒకసారెప్పుడో కాంత.



"ఎందుకూ? మనకి అప్పులు పెట్ట టానికి మీ నాన్నగారికి అనవసరంగా ఏభయి రూపాయల ఖర్చు"—అన్నాను నేను..... మళ్లీ ఆ మాట ఎప్పుడూ అనలేదు కాంత !!!

ఆ రోజులనుండి ఎదురుచూసిన ఒకటో తారీఖు వచ్చింది. జీతం తీసుకున్నాను. సాయంత్రం ఇంటికి వచ్చేస్తూంటే ఆఫీ సరు పిలచాడు. దగ్గరకు వెళ్లి ఆయన యిచ్చిన కాగితం తీసుకున్నాను. చదువు కున్నాను. నా కాలిక్రింద నున్న నేల కదులు తున్నట్లు, కళ్లు చీకట్లు క్రమ్మినట్లూ అయిపోయింది. చాలా కోపం వచ్చింది. ఆ కోపంలో ఆఫీసరు గొంతు నులిమి పారేయా అనిపించింది. కానీ నేను మామూలు గుమాస్తాని. కోపాన్ని అణచు కోవటం నాకు ఉగ్గుతో పెట్టిన విద్య. మాట్లాడకుండా ఇంటికి వచ్చేశాను. తెచ్చిన జీతాన్ని కాంత చేతిలో పెట్టాను.

"ఎప్పుడూ లేనిది డబ్బంతా నాచేతికి యిస్తున్నా రేమిటి?" అన్నది కాంత నవ్వుతూ!

"ఇది నా ఆఖరి జీతం కనుక!"

కాంతకు అర్థం కాలేదు. జేబులోంచి కాగితం తీసి యిచ్చాను.

"ఏమిటిది?" అంది—దాన్ని అటూ యిటూ త్రిప్పిచూసి.

"నేను నమ్ముకున్న ధర్మానికీ,నా నీతి నిజాయితీలకూ విలువకట్టి ఇచ్చిన బహు మతి పత్రం!"—నా మాటలు కాంతకు పూర్తిగా బోధపడలేదు. విడమరచి చెప్పాను. "నేను ఒకరి దగ్గర అయిదు వందల రూపాయలు లంచం తీసుకొని పనిచేసి పెట్టానుట. అందుకని అసలు విష యాన్ని పరిశోధించి నిజానిజాలు తెలుసు కునేంతవరకూ నన్ను 'సస్పెన్షన్' లో ఉంచారు"—అని!

ఎంక్వయిరీలో నిజానిజాలు బయటపడ తాయా? నమ్మకం ఎక్కడ?.... నేను గుమాస్తాని!.... నా మాట నమ్మే దెవరు? నన్ను చూసి వెకిలిగా నవ్విన ఆ 'పెద్ద మనిషి'—భయంకరమైన ఆ 'నిజాన్ని' బయట పెడతాడని నమ్మక మెక్కడ?...